# ధర్మం

కుండి సాయిబాబా





సాయంత్రం అరయ్యింది! వాతావరణం చల్లగా పొడిగా వుంది!

ఆరోజు ప్రముఖ నటుడైన సుందర్‌కుమార్ నటించిన చిత్రం రిలీజ్! అంచేతే ఐదుగంటలకే సుకన్యా థియేటర్ ప్రాంగణమంతా క్రిక్కిరిసినట్లు జనంతో నిండిపోయింది! బుక్కింగ్ కౌంటర్లు జనంతో కిటకిటలాడుతున్నై!

చలపతి నెమ్మదిగా చేతులుకట్టుకుని నడుస్తూ హాలుముందుకొచ్చాడు! వాల్‌పోస్టర్లు చూస్తూ నిలబడ్డాడు!

చలపతి ఔత్సాహికుడూ, ఆదర్శవంతుడూ ఐన యువరచయిత!... అడపా దడపా అతని రచనలు పత్రికల్లో చోటు చేసుకుంటున్నాయి! స్టేట్ బ్యాంకులో టైపిస్టుగా పనిచేస్తున్నాడు! రోజూ ఆ హాలువరకూ షికారుగా రావడం; రకరకాల మనుషుల్ని, ప్రవర్తనల్ని గమనించడం అతని అలవాటు!

వాల్‌పోస్టర్లని చూడ్డం పూర్తి కాగానే జేబులోకి చెయ్యి పోనిచ్చి, వచ్చే మనుషుల్ని త్రొక్కుకుంటూ ఓప్రక్క నడిచాడు!

అక్కడ— ఓ ముసలి గ్రుడ్డి బిచ్చగాడు అడుక్కుంటున్నాడు "అయ్యా!... ధర్మం... బాబూ...!'

చలపతి జేబులోంచి ఓ పావలా కాసు తీసి గుడ్డిబిచ్చగాడి చేతిలోని రేకు చిప్పలో వేశాడు. వెనుదిరిగి మళ్ళీ వచ్చేపోయే మనుషుల్ని చూడ్డంలో మునిగిపోయాడు!

చలపతి రోజూ ఆ గుడ్డి బిచ్చగాడికి ఓ పావులా ధర్మం చేస్తాడు!... అవకాశం వున్నంతలో కొంతవరకైనా పేదవారికి, నిర్భాగ్యులకు,నిస్సహాలకు సహాయం చెయ్యాలన్నది అతని అభిమతం!

క్రమంగా ముసురుకుంటున్న చీకటి విద్యుత్ లైట్లతో పారద్రోలబడింది!

బుకింగ్ కౌంటర్లు ఓపెన్ చేశారు! టికెట్లు అమ్మకం మొదలెట్టారు! జనం తుమ్ముకుంటున్నారు! కొట్టుకుంటున్నారు!

చలపతి యధాలాపంగా చూస్తూ నిలబడ్డాడు, చేతులు కట్టుకొని!

పావుగంట అయ్యేసరికి కౌంటర్లు మూసి, హౌస్‌ఫుల్ బోర్డులు తగిలించారు!... బ్లాకు వ్యాపారం మొదలైంది!

టికెట్లు దొరికినవారు ముఖంనిండా ఆనందం పుంజుకొని థియేటర్‌లోనికి పోతూంటే...దొరకనివారు బ్లాకులో కొనలేక... వాళ్ళకేసి ఈర్ష్యగా చూస్తూ నిరాశగా మరలుతున్నారు!

ఏడయ్యింది!...హాల్లో న్యూస్‌రీల్ వేయడం ప్రారంభించినట్లున్నారు! టిక్కెట్లు కొనుకున్న వారందరూ లోనికి పోసాగేరు!

క్రమంగా హాలుముందుండే జనసమ్మర్ధం తగ్గిపోయింది. బ్లాకులో టిక్కెట్లు అమ్మేవారి చుట్టు ప్రక్కల కొందరు తప్ప మిగతా స్థలమంతా ఖాళీ అయ్యింది! చాలామంది వెళ్ళిపోయారు!

అంతలో—(అప్పుడు)—నలుగురు...విద్యార్థుల్లా, అభిమానసంఘపు కుర్రాళ్ళలా వున్నారు ...గబగబా ఒగరుస్తూ వచ్చారు!

వారిలో ఒకాడు ఖాళీకౌంటర్లను చూచి హాయ్యో! హౌస్‌ఫుల్ అయిపోయిందిరా!" అన్నాడు నిరాశగా!

"అందుకే...త్వరగా వెళ్దాం పదరా అంటే నువ్వే లేటు చేశావు... ఇప్పుడేవఁయ్యింది ?" చిరాగ్గా, కోపంగా అన్నాడింకొకడు!

"అయితే... ఇప్పుడేం చేద్దాం?... మానేద్దామా ?!"

నాల్గోవాడు దృఢంగా అన్నాడు "వీల్లేదు! వెనక్కి వెళ్ళిపోవడమన్న ప్రశ్నే లేదు!... మన అభిమాన నటుడు, సూపర్ యాక్టర్ సుందర్ కుమార్ సినిమా రిలీజ్ నాడు చూళ్ళేక వెనక్కి వెళ్ళిపోవడమా ?! ఛీ ఛీ పిగ్గుచేటు!" క్షణమాగి "బ్లాకులో టికెట్లు కొనైనా సరే వెళ్దాం"

"డబ్బులు చాల్తాయో లేదో..." గొణిగాడు ఒకడు, జేబులో వున్న చిల్లరతో సహా డబ్బు తీస్తూ!

కుతూహలంగా చూస్తూ వాళ్ళదగ్గరకెళ్ళి నిలబడ్డాడు చలపతి!

ముగ్గురు జేబుల్లో వున్న డబ్బులన్నీ తీసి లెక్కెట్టుకున్నారు!

మొత్తం అంతా కలిపి ఇరవై రూపాయలకి నలభై పైసలు తక్కువగా వుంది! నలుగురూ బ్లాకు టికెట్లమ్మే ఒకడిదగ్గరకెళ్లారు!

"రెండ్రూపాల టికెట్టు రేటు ఐదు రూపాయలు... మొత్తం ఇరవై రూపాయలు."

"ఏవండీ...నలభై పైసలు తక్కువగావుంది" ననగారు వాళ్ళు!

"అదేం కుదర్దు!...నేజెప్పిన రేటుకి పైసా తగ్గినా ఇవ్వను...టికెట్లు అమ్మకపోవన్న భయం నాకు లేదు. కాదంటే...అదుగో వాళ్ళకి అమ్మేస్తాను" కరాఖండిగా అన్నాడు బ్లాకు టికెట్ల అమ్మకందారుడు!

కొండంత నిరాశతో నలుగురూ నిల్చుండిపోయారు, ఏదో గొణుక్కుంటూ!




ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

# - జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు, జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

—— వివరములకు ——

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 22757

**THE EL-P-EM INDUSTRIALS**

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002

**SALES BRANCHES :-**

**112, Zeera, Secunderabad - 3.**
**13/85, Jayachamarajendra Road, Bangalore - 2.**
**10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.**

చలపతి మరింత కుతూహలంతో వారిని గమనించసాగేడు.

అంతలో... గుడ్డి బిచ్చోడు తడుముకుంటూ ఆ నలుగురి దగ్గరకొచ్చాడు! "అయ్యా... ధర్మం...అయ్యా...ధర్మం చెయ్యండి బాబూ"

నవ్వొచ్చింది చలపతికి! నలభై పైసల్లేక అల్లల్లాడిపోతున్న వాళ్ళు ధర్మంచేస్తారా! చెయ్యగలరా!

చలపతి అనుకున్నట్లే అయింది!

"ఛీ!...వెళ్ళు... మాకే డబ్బులు చాలక బాధపడుతూంటే ధర్మం చెయ్యాలా—" చీదరించుకున్నారు! గుడ్డి బిచ్చోడు తడుముకుంటూ సాగిపోయాడు.

అంతలో వాళ్ళల్లో ఒకడి మొహంలో రంగులుమారాయి. నవ్వు ముఖాన అలుముకుంది!

చేతుల్లోవున్న చిల్లరని కదిపి ఓ పది పైసల నాణెం బైటికి తీశాడు!

"ఒరేయ్...గుడ్డోడా...ఇంద... తీసుకో" అంటూ బిచ్చగాడి దగ్గరకెళ్ళి వాడి చేతులో వున్న రేకు చిప్పలో జాగ్రత్తగా వేశాడు!

బిచ్చగాడు ఆనందాన్ని గుడ్డికళ్ళల్లో ప్రతిఫలింపజేస్తూ, తలాడిస్తూ తడుముకుంటూ సాగిపోయాడు!

చలపతి ఆశ్చర్యంగా అయోమయంగా వారికేసి చూశాడు!

వాళ్లు నలుగురూ గబగబా బ్లాకులో టికెట్లమ్మేవాడిదగ్గరకెళ్ళారు! డబ్బులు వాడి చేతిలో పెట్టారు! వాడు డబ్బు లెక్కెట్టుకుని నాల్గు టిక్కెట్లు ఇచ్చాడు! వాళ్ళు నలుగురూ ఆనందంగా ఈలలేసుకుంటూ హాల్లోకి పరుగెత్తారు!

చలపతి కేమీ అర్థంకాలేదు! నలభై పైసలు తక్కువైతే టికెట్లు ఇవ్వనన్నవాడు ఏభై పైసలు తక్కువైతే ఎలా ఇచ్చాడు?

ఆ విషయాన్నే బ్లాకు టికెట్లు అమ్మిన వాడి దగ్గరకెళ్లి అడిగాడు. వాడు చెప్పాడు— సరిగ్గా ఇరవై రూపాయలు ఇచ్చారని!

చలపతికి ఇదేదో అర్థంకాని మిష్టరీలా అన్పించింది! నలభై పైసలు లేనివాళ్ళకి అందులోని పది పైసలు దానం చేసెయ్యగా ఏభై పైసలు ఎక్కణ్నించి వచ్చింది?

ఆలోచిస్తూనే...చలపతి, ప్రక్కనే తడుముకుంటూ, గొణుక్కుంటూ సాగిపోతున్న గుడ్డి బిచ్చగాడి రేకుచిప్పలోకి యధాలాపంగా చూసి అదిరిపడ్డాడు!

ఇందాక తను పావలా చిప్పలో వేసేముందు ఓ అర్థ రూపాయి నాణెం, ఓ ఐదుపైసల నాణెం మాత్రమే వుండేవి చిప్పలో!... కాని ఇప్పుడు ఆ చిప్పలో ఓ పావలా నాణెం, ఓ పదిపైసల నాణెం, ఓ ఐదు పైసల నాణెం మాత్రం వున్నాయి!

అంటే?!...వాళ్లు పది పైసలు... ధర్మంగా ...చిప్పలో వేసి...!?... జరిగినది చలపతికి అవగతమైంది! ఓడుపుగా అర్థరూపాయి తీసేసాడన్నమాట!

కాని— మిష్టరీని ఛేదించిన ఆనందంకన్నా విచారమే కలిగింది చలపతికి!

బపితావారి ...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్, • చూస్త్రీ,
• రావ్ టూ, • సెలెక్ట్ ఒన్
• దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు.
తయారించువారు :
Phone: 22909
BAPITHA KNITTERS
Lakshmi Nagar, Tirupur - 638602.